సూర్య
నేటి దినపత్రిక
18వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,21 మార్చి 2025




# జిజిహెచ్ వార్డుల తనిఖీ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నందు గలన్యూరో సర్జరీ,ప్లాస్టిక్‌సర్జరీ, న్యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ,న్యూరాలజీమరియు క్యాజువలిటీ నందు తనిఖీలు నిర్వహించారు. ఆర్ఐసియూని పరిశీలించి అచట ఉన్న రోగులకు అత్యవసర చికిత్స అందు విధానమును పరీక్షించి, వైద్యులకు మరియు నర్సులకు తగు సూచనలు చేసినారు. ఈ వార్డులలో బయో మెడికల్ వేస్ట్ సెగ్రిగేషన్ పరిశీలించడము జరిగినది. ఈ వార్డులలో రోగులతో వారికి అందుతున్న సేవలు నిమిత్తము అనగా వైద్యులు మరియు సిబ్బంది రోగులతో ప్రవర్తించి తీరు, అందుతున్న వైద్యం, ఆసుపత్రిలో సేవలకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా?ఆసుపత్రిలో పెట్టు భోజనము నాణ్యత కలిగి ఉన్నదా లేదా మరియు ఆసుపత్రిలోని పరిశు భ్రత ప్రమాణములు ఎలా ఉన్నవి? ఆరా తీయడం జరిగినది. ఆసుపత్రిలో మందులు ఉచితంగా అందిస్తున్నారా లేదా బయటకు ఏమైనా కొనుక్కోవడానికి రాస్తున్నారా? అని ఆరా తీశారు.

- తరువాయి 2లో..

### గోపాలపురం మండలం పెద్ద గూడెం గ్రామంలో

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- స్టోరేజ్ ట్యాంకులను తప్పనిసరిగా క్లోరినేషన్ చెయ్యాలి
- ఎప్పటికప్పుడు నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలి
- గ్రామంలో డయేరియా కేసులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి
- వడగాడ్పుల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలి
- కలెక్టర్ పి.ప్రశాంతి



**గోపాలపురం,మేజర్‌న్యూస్ :** గురువారంసాయంత్రం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గోపాలపురం మండలం పెద్దగూడెం గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి అక్కడ ఆర్డబ్ల్యూఎస్ ద్వారా గ్రామపంచాయతీలో తాగునీటి సరఫరా చేస్తున్న వ్యవస్థను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, రానున్న రోజుల్లో వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ప్రజలకు శుద్ధిచేసిన త్రాగునీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈ గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడం నేపధ్యంలో ఎటువంటి నిర్లిప్తతకి అవకాశం లేకుండా శుద్ధి చేసిన త్రాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇక్కడ సేకరించిన నీటి నమూనాలు ల్యాబ్ పంపించి పరీక్షించడం జరిగిందన్నారు. వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ చేయడం ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు నిరంతర ప్రజలకూ అందించడం సాధ్యం అవుతుందని తెలిపారు. స్టోరేజ్‌ట్యాంకులపైమూతలు ఉంచడం, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ లకు పంపించి పరీక్షించడం జరగాలని, గ్రామంలో శానిటేషన్ తీరును మరింత మెరుగైన రీతిలో నిర్వహించడం తో పాటు గ్రామస్థులకు అవగాహన కల్పించడం ముఖ్యం అన్నారు. ప్రస్తుతం గ్రామం లో డయేరియా పూర్తి అదుపులో ఉందన్నారు. వేసవి దృష్ట్యా కాచి చల్లార్చిన నీటిని త్రాగడం, ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుంచి సాయంత్రం4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో

- తరువాయి 2లో..

# ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు..

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ,మేజర్‌న్యూస్:** ఈవీఎం,వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్. రాజేశ్,కాకినాడ అర్బన్‌తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (తెదేపా), ఎస్.అప్పారావు (బీఎస్పీ), బి.జయప్రకాష్ (కాంగ్రెస్), కె.కృష్ణమోహన్ (ఆప్),ఆర్.వెంకటేశ్వర రావు (వైఎస్సార్సీపీ), సీహెచ్. రమేష్‌బాబు( భాజపా), టి. ఈశ్వరరావు(సీపీఎం),ఎ.సత్యనారాయణ (జనసేన), ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ ఆవరణలో అరకు కాఫీ

**- ఆస్వాదించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అసెంబ్లీ ఆవరణలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ బ్రాండ్ అరకు కాఫీని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆస్వాదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకు కాఫీ అనేది ఆర్గానిక్‌గా పెరిగే,అద్భుతమైన రుచినికలిగిన కాఫీ అనిఈకాఫీ ప్రత్యేకత సున్నితమైన సువాసన, మృదువైన రుచికలిగిఉండి, సహజమైన పద్ధతిలలో ఉత్పత్తి జరుగుతుంది అని, ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈఅరకుకాఫీ,ఆంధ్రులకు

- తరువాయి 2లో..

### మత్స్యకారులకు ప్రకృతి వైపరీత్యాల ఉపసమనం..

# ఇన్సూరెన్స్ సౌకర్యం

**- శాసనసభలో కాకినాడ ఎమ్మెల్యే వనమాడి**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోతున్న మత్స్యకారుల మెకనైజడ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని శాసనసభ్యులు వనమాడి కొండబాబు గురువారం శాసనసభలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సముద్రంలో వేట చేయు మెకనైజ్డ్ బోట్లు కాకినాడ జిల్లాలో 395 మరియు మోటరైజెడ్ బోట్లు 3694 ఉన్నాయిని, ఇటీవల కాలంలో సముద్రంలో సంభవించు ప్రకృతి వైపరీత్యాల వల్ల మరియు అగ్ని ప్రమాదాల వలన కొన్ని బోట్లు పూర్తిగా నష్టపోవుట జరిగినదని, దీని వలన బోటు యజమాని ఆర్థికంగా చాలా నష్టపోవుట జరుగుతున్నదని, ఈ పరిస్థితి నుండి మత్స్యకారులను రక్షించుటకు ఒక సమగ్రమైన ఇన్సూరెన్స్‌పాలసీ అవసరమని,పాండిచ్చేరిగవర్నమెంట్ జీవో నెంబర్:15 (తేదీ :1-06-2009) ద్వారా మత్స్యకారుల బోట్లకు ఇన్సూరెన్స్ పథకమును అమలు చేస్తుందని, ఈ పథకంలో భాగంగా జీవో ఎంఎస్ నెంబర్ : 02/ఎఫ్‌వై తేదీ. 02-06-2023 ద్వారా మత్స్యకారుడు తన బోటుకు చెల్లించిన ప్రీమియం నుండి 90 శాతం వెనుకకు పొందుట జరుగుతుందిని, ఈ పథకం ద్వారా పాండిచ్చేరి ప్రభుత్వం 15 హెచ్‌పి లేదా అంతకంటే ఎక్కువ ఇంజన్ సామర్థ్యం కలిగిన అన్ని బోట్లకు వర్తింప చేస్తుందని,ఈపథకంవలన బోటు యజమానులకు ఆర్థికపరమైన భద్రత కలుగుతుందని, పాండిచ్చేరి ప్రభుత్వం ప్రస్తుతం యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ మరియు నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, కాబట్టి ఈఇన్సూరెన్స్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అన్ని యాంత్రిక పడవలకు వర్తింప చేయడానికి గల అవకాశాలు పరిశీలించి కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) ద్వారా ఈ పథకం అమలు చేసి బోటు యజమానులకు వారి బోట్లకు సంబంధించి ఇన్సూరెన్స్ భద్రత కల్పించాలని కోరుచున్నామని పేర్కొన్నారు.

# అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వారిగా ఎలక్ట్రోరోల్ సంఖ్య, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలుబీ బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు నియామకం, శిక్షణ కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఆధార్ నెంబర్‌కు ఎలక్ట్రోరల్ అనుసంధానం చేయడం వంటి అంశాలను ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి..రాజకీయ పార్టీలు ప్రతినిధులతో చర్చించారు.

ఈ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ .. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్య అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల తరలింపు, నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. అదేవిధంగా జిల్లా యంత్రాంగం నుంచి అన్ని నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారులు(బీ.ఎల్.ఓ) నియమించి, ఏప్రిల్ 15 నాటికి అందరికీ శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,లక్షల 36,916 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 1000-1200 మంది ఓటర్లు 586 పోలింగ్ కేంద్రాల్లోనూ, 1200పైన ఓటర్లు 279 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ఆయన తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800-1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభాజించనున్నామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు కిలోమీటర్లకు మించి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉండకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైనన్ని అన్ని సదుపాయాల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.సమావేశంలో డీఆర్వో వెంకటరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి ఎం.జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (తెదేపా), ఎస్.అప్పారావు (బీఎస్పీ), బి.జయప్రకాష్ (కాంగ్రెస్), కె.కృష్ణమోహన్(ఆప్), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్సీపీ), సీహెచ్.రమేష్ బాబు(భాజపా), టి.ఈశ్వరరావు( సీపీఎం), ఎ.సత్యనారాయణ (జనసేన), ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో విజ్ఞానదాయకంగా ముగిసిన వ్యవస్థాపకత అధ్యాపక అభివృద్ధి శిక్షణా తరగతి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఐసిసి-ఈడిసి విభాగములో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అనే అంశం పై అతిథి ఉపన్యాసం ఘనంగా జరిగింది. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ రంగంలో చక్కటి పరిజ్ఞానాన్ని కలిగి వ్యాపార అధికారి డాక్టర్ పావని కడియాల, ఆల్ ఇండియా రోబోటిక్స్, ఎంతో చక్కగా వివరించారు. ఆద్యంతం ఆచరణాత్మకంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొని ఎన్నో సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.వివిధ విభాగాలకు చెందిన సుమారు 50 మంది అధ్యాపకులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం కళాశాల అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డా.ఎస్.రమాశ్రీ , రిజిస్ట్రార్ డా. జీ. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా. దోలా సంజయ్ ఎస్,డీన్ ఈ .డి.సి. జె డి వెంకటేష్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఘనంగా బండారు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు





**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. రావులపాలెం మండల పార్టీ అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో రావులపాలెంలోని వివిధ ఏరియాలో పేదలకు ప్రయాణికులకు అందులకు అభాగ్యులకు తమ నాయకుడి పుట్టినరోజు సందర్భంగా ఆహారాన్ని అందించి వారి యొక్క దాహార్తిని తీర్చారు. తమ నాయకుడు లక్ష్యం కూడా పేద ప్రజలకు అట్టడుగు వర్గాలకు సేవే లక్ష్యంగా పెట్టెదన్నం పెట్టడమే ధ్యేయంగా భావిస్తూ రావులపాలెంలోని అంబటి కిషోర్ ఆధ్వర్యంలో నేను సైతం అనే కార్యక్రమాన్ని తలపెట్టి ప్రయాణికులకు పేదలకు ఆహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని తమ నాయకుడు ద్వారానే ఆదర్శప్రాయంగా తీసుకుని ఇటువంటి కార్యక్రమాలు నెలకొల్పుతున్నామని, మా నాయకులు కూడా సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు కొనసాగు తున్నారని, వారు ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, త్వరలోనే ఆయనకు మంచి పదవి వరించాలని తద్వారా ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం వెంకటేశ్వర స్వామి అనుగ్రహించాలని వారు కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల నాయకుడు బండారు బాబి, గాయత్రి ప్రసాద్, గీదా వెంకటేష్, వెత్సా సత్యనారాయణ, పెచ్చెటి సురేష్, దాసరి వంశీ బెన్ తదితరులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ వార్డుల తనిఖీ

మొదటిపేజి తరువాయి

రోగులు మరియు వారి సహాయకులు అందరూ ఆసుపత్రిలో సేవలు సంతృప్తికరంగా కలవని, ఎవరూ డబ్బులు అడగటం లేదని, మందులు అన్ని ఉచితంగా ఇస్తున్నారని చెప్పడం జరిగినది. ఈ తనిఖీల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ విటల్, డాక్టర్ శ్రీనివాసన్, నర్సింగ్ గ్రేడ్ టు జయశ్రీ మరియు ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాలపురం మండలం పెద్ద గూడెం గ్రామంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మొదటిపేజి తరువాయి

మాత్రమే బయటకి వెళ్లడం, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలనీ ఆదేశించారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ టి రాజీవ్, ఆర్డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ జి టీవీ అజయ్ బాబు, ఏ ఈ బంగారయ్య, గ్రామ కార్యదర్శి వి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఆవరణలో అరకు కాఫీ

మొదటిపేజి తరువాయి

మరియు భారతీయలకు గర్వకారణంగా నిలుస్తోందని తెలియ జేసారు.అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సభాపతి, ఉప సభాపతులకు ధన్యవాదములు తెలియజేసారు.

## శోభన్‌బాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ శోభన్ బాబు 17 వర్ధంతి



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రుల అందాల నటుడు, పద్మభూషణ్ స్వర్గీయ శోభన్ బాబు 17 వర్ధంతి కార్యక్రమాన్ని కొవ్వూరు పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో గురువారం నిర్వహించారు. శోభన్ బాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనపర్తి గోపాలకృష్ణ, శోభన్ బాబు అభిమాని కే.ప్రకాష్, పాక శ్రీనివాస్, అభిమానులు పాల్గొన్నారు.

## కొమరాపురంలో 300 మందికి కంటి వైద్య పరీక్షలు





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని వాతంగి పంచాయతీ కొమరాపురం గ్రామం లో గురువారం 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందచేశారు. ఏ బి కాలనీ చెందిన వైసీపీ సీనియర్ కార్యకర్త జి శేషగిరిరావు ఆధ్వర్యంలో వైజాగ్ మెడికవర్ హాస్పిటల్ విజయ నగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వారిచే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంను గ్రామ సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జుర్ర రాజేశ్వరి,జుర్ర జాను, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, అమినాబాద్ సర్పంచ్ కించు వెంకట లక్ష్మి,ఉప సర్పంచ్ చేదులూరి రాజబాబు, చేదులూరి అంజిబాబు, పోసిన అప్పారావు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి బ్రాహ్మణ మహిళ మణిహారం కృషి





కాకినాడ, మేజర్ న్యూస్ : బ్రాహ్మణ మహిళలు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు సౌగంధికా బ్రాహ్మణ మహిళ మణిహారం కృషి చేస్తుందని సంస్థ అధ్యక్షురాలు సుచిత్ర బాలాంతరపు, గౌరవ అధ్యక్షురాలు మెట్ట రాధ పేర్కొన్నారు. కాకినాడ వెంకటరత్నపురంలో గల దండు కళాక్షేత్రంలో సోగదిక బ్రాహ్మణ మహిళ మణిహారం ఆధ్వర్యంలో 2వ వార్షికోత్సవ వేడుకలు సౌగదికా అవార్డ్స్ ఫంక్షన్ ను మహా కుంభ పేరిట నిర్వహించారు. కార్యక్రమానికి సౌగంధికా బ్రాహ్మణ మహిళ మణిహారం అధ్యక్షురాలు సుచిత్ర బాలాంతరపు అధ్యక్షత వహించగా బ్రాహ్మణ ప్రముఖులు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజికవేత్త నడింపల్లి యమునా పటాక్స్, హైదరాబాదుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంశులు, సంగీత విధ్వత మణి డా.బాల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పలువురు సంగీత కళాకారులు గాత్ర కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులు బుచ్చు ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా సౌగంధికా బ్రాహ్మణ మహిళ మణిహారం అధ్యక్షురాలు సుచిత్ర బాలాంతరపు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా కాకినాడ పరిసర ప్రాంతాలలో లక్ష రూపాయలతో సామాజిక సేవా కార్యక్రమాలు, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి సౌజన్యదిక అవార్డులు పలువురుకు ప్రధాన చేయడమే కాకుండా 300 మంది బ్రాహ్మణ మహిళలచే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అష్టలక్ష్మి వైభవం కార్యక్రమం నిర్వహించారు. ఇవేకాక విద్యా వైద్య సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు మెట్ట రాధ మాట్లాడుతూ సౌగంధిక బ్రాహ్మణ మహిళ మణిహారం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మహిళలను అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పోలవరం మహిళలకు సోగంధికా అవార్డులను అతిథులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారణాసి విజయ లక్ష్మి, చావలి సూర్యకుమారి,ఆకెళ్ళ పద్మ,వీరేశ్వరపురాజి,దువ్వూరి శ్రీరామలక్ష్మి, పరాంకుశం అపరంజిత, ద్రోణంరాజు కాత్యాయని, పురాణపండ మహాలక్ష్మి, నూకల భాగమతి,పెద్ద సంఖ్యలో బ్రాహ్మణ మహిళలు పాల్గొన్నారు.

# న్యాయవాద వృత్తిలో కోరా సేవలు మరువలేనివి

**– పలువురు సీనియర్ న్యాయవాదులు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాది, దివంగత కోరా భాస్కర నారాయణమూర్తి స్మృతి చిహ్నంగా నిర్మించిన హాలులో వారి చిత్రపట ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. గురువారం కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. మాజీ లోకసభ స్పీకర్ గంటి మోహనచంద్ర బాలయోగి వంటి మహానుభావులతో నారాయణమూర్తి కలిసి పనిచేశారని, న్యాయవాద వృత్తిలోనే కాకుండా పలు సేవా కార్యక్రమంలో ఆయన భాగస్వాములయ్యారని తెలిపారు. ఆయన మరణంతారం కాకినాడ బార్ అసోసియేషన్ భవనంలో వారి కుటుంబ సభ్యులు స్మృతికి చిహ్నంగా నిధులు అందజేయడం సంతోషదాయకమని పలువురు న్యాయవాదుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొగ్గవరపు గోకుల కృష్ణ, జీవీ కృష్ణ ప్రకాష్, జవహర్ అలీ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబెర్ నరహరిశెట్టి రవికృష్ణ, కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్కా శ్రీనివాసరావు, నారాయణమూర్తి జూనియర్ న్యాయవాదులు కే.వి.వి.చలపతి, మంగా వెంకటశివ రామకృష్ణ, కుటుంబ సభ్యులు ప్రభాకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్స్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించండి



- కనీస వేతనాలు ఇప్పించండి
- సీఎం, డిప్యూటీ సీఎం ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని డిమాండ్
- కాకినాడ పెద్దాపురం జగ్గంపేట డివిజన్ మీటర్ రీడింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా
- ఎలక్ట్రికల్ సూపరిటెండింగ్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేసిన సంఘ నాయకులు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్తు మీటర్ రీడర్స్ లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ రీడర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కాకినాడ కుళాయి విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్ రీడర్స్ మరియు సంఘ నాయకులు తెలుగు తల్లి విగ్రహం నుండి భారీ ర్యాలీగా ఫ్లెక్సీలతో కరపత్రాలతో బయలుదేరి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అని నినాదాలు చేస్తూఎలక్ట్రికల్ సూపరిటెండింగ్ ఇంజనీర్ ప్రసాద్ కు వినతి పత్రం అందించారు. అనంతరం కాకినాడ డివిజన్ బి.ఎస్.రావు, జగ్గంపేట డివిజన్ పి.నానాజీ మీడియాతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని చాలీచాలని పీస్ రేటు కమిషన్‌తో నెల మొత్తంలో 10 రోజులకే ఉద్యోగాన్ని కుదించి పొట్ట కొట్టారని అంతేకాకుండా ములుగే నక్కపై తాటి పండు పడ్డట్లుగా ఈ ప్రభుత్వం పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చి మరింత అన్యాయం చేస్తుందని వాపోయారు.

టెక్నాలజీకి మేము అడ్డు రాము అని కానీ మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి మినిస్టర్ నారా లోకేష్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత తదితరులను కలిసి వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరామని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించడం లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టడం జరిగింది అని, ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కనీస వేతనాలు కల్పన కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో కాకినాడ డివిజన్ నాయకులు ఎం.వీరబాబు, డి.ఎస్.ఎన్. రెడ్డి, ఎస్.కె మదీనా, కుమార్, నూకరాజు, రామకృష్ణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

# విద్య కాషాయకరణ, కార్పొరేటీకరణ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

**– భగత్ సింగ్, రాజ గురు సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సభలను జయప్రదం చేయండి**

**– పీ.డీ.ఎస్.యు, పి.వై.ఎల్ ప్రజా సంఘాలు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నాగమల్లి సెంటర్ వద్ద రాజరాజేశ్వరి ఐటిఐ లో జాతీయ కార్యవర్గం పిలుపులో భాగంగా కామ్రేడ్ భగత్ సింగ్ ,రాజగురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సభ పోస్టర్లు గురువారం ఆవిష్కరించడం జరిగింది. దీనిలో ముందుగా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, యువతకు స్ఫూర్తి ప్రదాతలు అయిన భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సభలు, సదస్సులు, కాగడాల ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు, వినుత్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలిపారు. మార్చి 23న దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులో నూనూగిమీసాల వీరులు పొగ బాంబులతో బ్రిటిష్ వారిని భయపెట్టిన ధీరులు, ఉరికొయ్యను ముద్దాడిన వీరులు అయిన భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా మార్చి 23 నుండి 30 వరకు జిల్లాలో పలు చోట్ల వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని, సభలు, ర్యాలీలు వంటివి నిర్వహిస్తున్నామని యువత ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.వీరి త్యాగాలను నేటి యువత గుర్తించి ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కుని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని, ఆంధ్రప్రదేశ్‌ని కాపాడుకుంటమని, అందరికి అందుబాటులో విద్య, ఉపాధి, వైద్యం కోసం పోరాడుతామని, విద్యా కార్పోరేటీకరణ, కాషాయీకరణ, అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలు విద్యను వ్యాపారంగా మార్చేయని, ప్రభుత్వ యూనివర్సిటీలు సామాజిక సేవను అందిస్తున్నాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే యుజిసి ఫెలోషిప్ స్కాలర్ షిప్ కోత విధించిందని తెలిపారు. రాష్ట్రాల హక్కులను ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాలరాస్తున్నదని ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన రాష్ట్రాల సమాఖ్యగా భారతదేశం ఉందని వాటి అవసరాలను, అస్తిత్వాన్ని గుర్తించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ యూనివర్సిటీలను విద్యార్థులే కాపాడుకోవాలని అందుకు బలమైన విద్యార్థి ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉన్నత విద్యారంగాన్ని మరింత వ్యాపారమయంగా మార్చడానికి నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రైవేట్ యూనివర్సిటీలకు, డీమ్డ్ యూనివర్సిటీలకు యూజీసీ విచ్చలవిడి అనుమతిలిస్తుందని మరోపక్క పేద వెనుకబడిన వర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ యూనివర్సిటీల్లో విద్యార్థి వ్యతిరేక సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు కరుపోతు నవీన్ కుమార్, మర్రి మూర్తి, టీ.తరుణ్, వినయ్, ప్రశాంత్, మణికంత, భూపతి, సత్య దేవ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భారీ విరాళం



**కాకినాడ,మేజర్‌న్యూస్:** గ్రామీణాభివృద్ధి పథకము మరియు ఆరోగ్య ప్రమాణాలు పెంచడంలో భాగముగా సామాజిక భాధ్యత క్రింద గురువారము జిల్లా కలక్టరు షాన్‌మోహన్ సగిలికి రూ.36.85 లక్షల చెక్కును యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ దుగ్గల్ అందజేయడం జరిగింది. సుమారు రూ.20.00 లక్షలు సూర్యారావుపేటలోని త్రాగునీటి ఫిల్టర్ మిడియని మార్చుటకు వెచ్చించడానికి మరియు రూ.16.85 లక్షలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో న్యూరాలజి డిపార్టుమెంటులో షెడ్‌ను నిర్మించేందుకు ఈ నిధులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమములో కలక్టరుతో పాటు జాయింట్ కలక్టరు రాహుల్ మీనా, ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్, యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ జనరల్ మేనేజర్ వసంతరావు మరియు కన్సల్టెంట్ డాక్టర్ నాగేంద్రకుమార్ పాల్గొనడం జరిగినది.

# నిరుపేదలకు వరంగా అన్న క్యాంటీను

**- ఆర్డిఓ కే.మాధవి**



**ముమ్మిడివరం, మేజర్ న్యూస్ :** నిరుపేదల కడుపునింపేందుకే అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ చేయడం ద్వారా నిరుపేదలు కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఆర్డిఓ కె.మాధవి పేర్కొన్నారు. గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీలోని అన్న క్యాంటీన్ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన పారామీటర్ల వారీగా నిర్వహణ ఉన్నది లేనిది ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న క్యాంటీన్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్లలో మెనూ ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియాతోపాటు స్వచ్ఛమైన తాగునీటి ఏర్పాట్లు, పరిసరాలు, ప్లేట్లు పరిశుభ్రతలను నిశితంగా పరిశీలించారు. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంతమవుతుందని, ఇలాంటి ఓ మంచి కార్యక్రమంలో భాగమవుతున్న సిబ్బంది నిబద్ధత, సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. అన్నిచోట్లా అన్న క్యాంటీన్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యాంటీన్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఇన్చార్జిలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. క్యాంటీన్ల పునరుద్ధరణ మూలంగా పేదల కళ్ళలో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు నెలకొల్పిన అన్న కాంటీన్లను సమర్ధవంతంగా నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ స్ధానిక అధికారులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాల ప్రకారం అన్న క్యాంటీన్లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారని మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్న క్యాంటీన్ల నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు.

ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణం పేదల కడుపు నింపి పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిబద్ధతతో కార్యక్రమాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. కేవలం రూ.5 లకే కడుపునిండా భోజనం పెట్టేందుకు ప్రభుత్వం మళ్లీ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించిందని తెలిపారు. క్యాంటీన్లో పెడుతున్న 5 రూపాయల భోజనాన్ని రుచి చూసి నాణ్యత పరిశీలించారు. పదార్థాల తయారీకి వినియోగించే సరుకులను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలు పూర్తి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భోజనం చేసేందుకు వచ్చిన కూలీలు, ఆటో రిక్షా నడిపేవారు, వివిధ ప్రాంతాల నుండి వివిధ పనులపై వచ్చిన వారితో ఆర్డీవో భోజనం ఎలా ఉందని ప్రశ్నించగా, భోజనం బాగుందని, కేవలం 5 రూపాయలకే భోజనం పెట్టడం సంతోషంగా ఉందని, అన్నం, పప్పు, ఒక కూర, చట్నీ ఇస్తున్నారని వారు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుబ్బలక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మంచి చదువు..మంచి ఆహారం.. లక్ష్యం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పోషణ్ బి పోషణ్ పడాయ్ కార్యక్రమం ద్వారా దేశంలోని పిల్లలందరకు మంచి చదువు మంచి ఆహారం అందించే లక్ష్యంతో అంగన్వాడీలకు జిల్లా ఐసిడిఎస్ అధికారుల ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు తెలిపారు. పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చిన్నారుల సంరక్షణ, విద్య, 3-5 సం.ల పిల్లలకు మెదడు పరిపక్వం చెందే సమయం కావున, ఆటపాటలతో వారిని ఉత్తేజపరచడం అంగన్వాడీల సమగ్ర అభివృద్ధి, పోషణ, నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. దీనికి సంబంధించి ప్రత్యేక మాడ్యుల్ను అంగన్వాడీలకు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమం అంగన్వాడీ సూపర్వైజర్లు చంద్ర కళ, ఉమ, రమణమ్మ, వెంకటలక్ష్మి, బి.పి.సి.కె.ప్రవీణ, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వ్యోమగామి సునీత విలియమ్స్కు హర్షం వ్యక్తం చేస్తూ ఏలేశ్వరంలో సంబరాలు..



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ నేటి బాలలు ఆదర్శంగా తీసుకోవాలని చైర్పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. గురువారం స్థానిక కోనేటి బాలికల పాఠశాల ఆవరణలో కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో సునీత విలియమ్స్ బృందం అంతరిక్షం నుండి భూమికి సురక్షితంగా తిరిగి రావడం పై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, బికెట్లు అందించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు సఖి రెడ్డి విజయబాబు మాట్లాడుతూ సునీత విలియమ్స్ అంతరిక్షంపై తన ఆరో సంవత్సరంలోనే ఆపేక్ష పెంచుకున్నారని దీనికి కారణం చంద్రుడు పై మొట్టమొదటిగా కాలు మోపిన నలి ఆర్మ స్ట్రాంగ్ ను ఆదర్శంగా తీసుకొని అంతరిక్ష పరిశోధనల వరకు ఎదిగి నేటి విజయాలను సాధించారన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పరిశోధనల పట్లఆసక్తి కలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు. వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అంతరిక్ష పరిశోధనల వరకు ఎదిగారని అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలన్నారు. నేడు మనం అనుభవిస్తున్న మొబైల్ ఫోన్, టీవీ, ఇంటర్నెట్ వంటి అత్యధిక టెక్నాలజీ ఇలాంటి వారి పరిశోధనల ద్వారానే సాధ్యమైంది అన్నారు. ప్రపంచానికే విజ్ఞానం అందించిన భారతీయ మేధావులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి యువత పెడత్రోవను పడకుండా వైజ్ఞానిక అంశాలపై దృష్టి సారించాలన్నారు. భరత భూమిపై జన్మించినందుకు ప్రపంచ దేశాలకు మన మేధాశక్తిని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి బూసరి అబ్బాయి, అలమండ దుర్గాప్రసాద్ బూడి సూరిబాబు,బూర్ల సత్తిబాబు, పైల శ్రీధర్, కడెంశెట్టి వాసు, బీసీ నాయకుడు వైభోగం సుబ్బారావు, రౌతు సహదేవుడు, పత్రికా ప్రతినిధులు స్వర్ణపుడి శ్రీనివాసరావు, కడప దుర్గారావు, దాసరి కృష్ణ, మువ్వల శ్రీను, పారేపల్లి గంగా ప్రసాద్, గొల్లపల్లి రాజబాబు, కట్ట వెంకటేశ్వరరావు, గొల్లపల్లి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ గణపతి, ఉపాధ్యాయులు సుమలత,ఎస్ కె రేష్మ శాంతి సుభాషిణి, గంగమ్మ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ అధికారి విధుల నిర్వహణా సామర్థ్యం పెంచడం ద్వారానే ప్రజల సంతృప్తి స్థాయి పెంచడం సాధ్యం

**- జెసి చిన్నరాముడు**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పౌర సేవలు అందించే క్రమంలో రెవిన్యూ అధికారి విధుల నిర్వహణా సామర్థ్యం పెంచడం ద్వారా మాత్రమే ప్రజల సంతృప్తి స్థాయి పెంచడం సాధ్యం అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. స్థానిక కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం రెవిన్యూ అధికారులు సమావేశంలో పిజిఆర్ఎస్, వాటర్ ట్యాక్స్ , ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూముల క్రమబద్ధీకరణ, పేదలందరికీ స్వంత ఇంటి స్థలాలు, ప్రభుత్వ భూముల గుర్తింపు, పౌర సేవలు పై డి ఆర్వో టి సీతారామ మూర్తితో క్షేత్ర స్థాయి రెవిన్యూ అధికారుల పనితీరు సమీక్షించారు. జెసి చిన్న రాముడు మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కార విధానంలో అధికారుల పనితీరుకు సంబంధించిన ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్జీ లు పరిష్కారం దిశగా చర్యలు హేతుబద్ధత కలిగి ఉండాలన్నారు. జిల్లా లో 626 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, వాటిలో కోరుకొండ లో 187 , గోపాలపురం లో 105 అర్జీలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్క రీ ఓపెన్ అయిన అర్జిల విషయంలో తహసిల్దార్ వ్యక్తిగత దృష్టి పెట్టడం, సంబంధింత గ్రామ రెవిన్యూ అధికారి నుంచి సమగ్ర నివేదిక ఆధారంగా అర్జీ దారులకు చెందిన పరిష్కార స్థాయి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఆర్ కృష్ణ నాయక్, కే ఆర్ సి సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ భాస్కర్ రెడ్డి,తహసిల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్,తదితరులు పాల్గొన్నారు .

# పిఠాపురం పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచండి

**- డిమాండ్ చేసిన సిపిఎం బృందం**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సిపిఎం బృందం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రజా చైతన్య యాత్ర పిలుపులో భాగంగా పిఠాపురం 2, 3, 4వ వార్డులో సిపిఎం బృందం పర్యటించి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె విశ్వనాథం మాట్లాడుతూ... భాష్యం స్కూల్ వద్ద డ్రైనేజీ నిర్మించడం జరుగుతున్నదని, అది సగం వరకే నిర్మిస్తున్నారని, అది పూర్తిగా వడ్రాల కాలువ వరకు నిర్మించకపోవడం వలన పైనుంచి వచ్చే మురికి నీరంతా అక్కడే స్టోరేజ్ కావడంతో అక్కడ ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందన్నారు.

కాబట్టి ప్రభుత్వ అధికారులు పరిశీలన చేసి వడ్రాల కాలువ వరకు ఆ డ్రైనేజీ నిర్మాణాన్ని కొనసాగించాలని, అక్కడే కిందకి దిగిపోయిన కల్వర్టును పునర్మించాలని, వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో... ఎక్కడికక్కడ మురికి నీరు నిలిచిపోయిద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందని, పట్టణంలో పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ అంతంత మాత్రము గానే ఉందని ఆరోపించారు. తక్షణం వీధిలైట్లు, పారిశుధ్యం డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె. చిన్న, కోనేటి రాజు, వి. సూర్యనా రాయణ, కె. మణి, రాజ్యలక్ష్మి, మణికంఠ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక సంస్థల భద్రతకు బాధ్యత...కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు

**- జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** భారతదేశ సమగ్రతను సమైక్యతను కాపాడుకునే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు రక్షణ చర్యలపై సముద్ర తీర ప్రాంతాలలో అవగాహన కల్పించడం ఎంతో సంతోషకరం మరియు స్ఫూర్తి దాయకమని జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ బుధవారం సాయంత్రం అమలాపురం చేరుకున్న సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ సభ్యులు స్థానికంగా బస చేసి తిరిగి గురువారం ఉదయం సముద్ర ప్రాంతంలోని నరసాపురం మీదుగా మచిలీపట్నం బయలుదేరిన స్థానిక గడియారపు స్తంభం జంక్షన్ వద్ద జండా ఊపి ఆమె ర్యాలీని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుజరాత్ నుండి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న ఈ సైకిల్ ర్యాలీలో కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వారి తరపున స్వాగతం పలుకుతూ తిరిగి సైకిల్ ర్యాలీని పునఃప్రారంభించడం జరిగిందన్నారు. దేశ సమగ్రత సమైక్యతను కాపాడుకోవడం తోపాటుగా విపత్కర పరిస్థితులలో ఉగ్రవాదుల చర్యలను దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన పెంపొం దించడం హర్షనీయమన్నారు. ఈ ర్యాలీని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల 56వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని రెండు టీములుగా సుమారు 6,550 కిలోమీటర్ల మేర నిర్వహించి దేశ ప్రజలకు పారిశ్రామిక భద్రత, ఉగ్రవాద చర్యల నుండి రక్షణ పొందేందుకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినం దనీయమన్నారు. ఈ బృందాలు ఎంతగానో శ్రమించి సైకిల్ ర్యాలీ ద్వారా దేశంలో పారిశ్రామిక రక్షణతో పాటుగా ప్రజల రక్షణ కొరకు చర్యలు గైకొనడం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల నిబద్ధతకు నిదర్శనమన్నారు. జిల్లా అడ్మిన్ ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వారి తరపున ర్యాలీని పునఃప్రారంభించేందుకు విచ్చేయడం జరిగిందని తెలిపారు. దేశ పారిశ్రామిక రక్షణ ప్రజల రక్షణ కొరకు అండగా తోడుగా నిలిచేందుకు ఈ ర్యాలీ తోడ్పాటు నందిస్తుందన్నారు. గుజరాత్లో ఈ నెల 7వ తేదీన కేంద్ర రక్షణ మంత్రి అమిత్ షా ఈ సైక్లోథాన్ ర్యాలీని ప్రారంభించారని తెలిపారు. ఈ ర్యాలీ సముద్రతీరం వెంబడి ఈ నెలాఖరు నాటికి కన్యాకుమారి చేరుకుంటుందన్నారు. దేశ ప్రజలకు రక్షణ భద్రతా చర్యల పట్ల అవగాహనను పెంపొందిస్తూ ఈ ర్యాలీని నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల సభ్యులను మనస్ఫూర్తిగా అభినందించారు. కేవలం పారిశ్రామిక రక్షణ కాకుండా దేశ ప్రజల సమైక్యత సమగ్రత మరి ముఖ్యంగా తీర ప్రాంత రక్షణ చర్యలపై అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. దేశ ద్రోహుల నుండి ఏవిధంగా రక్షణ పొందాలనే అంశాలపై దళాలు కల్పిస్తున్న అవగాహన ఎంతో ఉపయోగకరమైనదని ఆ దిశగా తీర ప్రాంత ప్రజానీకం పూర్తి అవగాహనను పెంపొందించుకొని సురక్షితమైన జీవనాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఎ.కె. ప్రభాకర్, తాసిల్దార్ అశోక్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య కార్యాలయంల్లో కన్వర్జెన్సీ సమావేశం



అల్లవరం, మేజర్ న్యూస్ : వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీలో ప్రకృతి వ్యవసాయం (ఏపిసిఎన్ఎఫ్), డిఆర్డిఏ కలిసి అల్లవరం మండలం మహిళా సమాఖ్య కార్యాలయంల్లో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు పై మూడు సంస్థలు కలిసి పనిచేసే ప్రకృతి వ్యవసాయ రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలు ప్రకృతి వ్యవసాయంలోకి మార్చాలని ప్రభుత్వ ధ్యేయంగా ఈ సమావేశంలో జిల్లా అధికారి డిఏఓ బోసుబాబు, రాజ శేఖర్, ఏడిఏలు షాంషీ, అల్లవరం ఏఓ సత్యనారాయణ మాట్లాడుతూ విచక్షణారహితంగా పురుగుమందులు ఎరువులు వాడటం వలన భూసారం పూర్తిగా క్షీణిస్తుందని భూసారం పెంచుకోవడానికి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని తెలియజేశారు. ఏపిసిఎన్ఎఫ్ ఏఓ శ్రీనివాస మాట్లాడుతూ జీవామృతం ఘనజీవామృతం మరియు ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన కషాయం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందని అలాగే 365 రోజులు భూమిని కప్పించేలా పంటలు వేయాలని దానికి అనుగుణంగా పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) 31 రకాల విత్తనాలు వేసి భూములు కలియదున్నడం వల్ల భూమికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేయడమైనది. అలాగే అల్లవరం మండల ఏపీఎం షహీద్ మాట్లాడుతూ రసాయన పురుగు మందుల వాడిన పదార్థాల వల్ల ప్రజలు ఆరోగ్యం పాడవుతుందని కావున మనం ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకుని వెళ్లడానికి మా డిపార్ట్మెంట్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్ము బాల నాగ వేణి, ఏపిసిఎన్ఎఫ్, ఎన్ఎఫ్ఏ హేమలత, రాధిక, ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ ఎం.సూరిబాబు, ఏఈవో గణేష్, అల్లవరం మండలం ఇం చార్జ్ ఎన్ఎఫ్ పాటి సింహాద్రి, అభ్యుదయ రైతులు ఎం.ఉదయ్ భాస్క రరావు మరియు ఇ.స్వామి, అల్లవరం మండల వివిఎస్ లు, వివిధ గ్రామాల విఓఎస్ లు,మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 5 నుండి శ్రీరామ నవరాత్రి మహోత్సవాలు



కాకినాడ, మేజర్ న్యూస్ : శతాబ్దాల ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన పిఠాపురం శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏప్రిల్ 5 నుండి 13వ తేదీ వరకు శ్రీరామనవమి నవరాత్రి మహోత్స వాలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు మైలవరపు శ్రీనివాసా చార్యులు తెలిపారు. మధ్వ తంత్రసారోక్త సాంప్రదా యానుసారం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామన్నారు. 5 తారీకు సాయంత్రం 6 గంటల నుండి స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తెగా చేసే పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతుందని, 6 తారీఖున శ్రీరామనవమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరుగుతుందని, భక్తులందరి సమక్షంలో స్వామివారి కల్యాణోత్సవం వేద పండితులచే నిర్వహించబడి అందరికీ స్వామివారి అక్షింతలను అందజేస్తారని అన్నారు. 7 తారీఖున రాత్రి 8 గంటలకు సదస్యం జరుగుతుందన్నారు. 8వ తారీకు ఏకాదశి పర్వదిన సందర్భంగా ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని, 9వ తారీఖున సాయంత్రం నాలుగు గంటల నుండి గరుడ వాహనంపై నగర పురవీధులలో నిర్వహిస్తున్నా మన్నారు, పదో తారీకు రాత్రి 8 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమం జరుగు తుందని, 11వ తారీకు ఉదయం 6 గంటల నుండి లక్ష తులసిపూజ, రాత్రి ఏడు గంటలకు భజన, ఎనిమిది గంటలకు పుష్ప ఉత్సవం, 9 గంటలకు శ్రీ పుష్ప యాగం జరుగుతుందన్నారు. 12వ తారీకు ఉదయం 5 గంటల నుండి అభిషేకాలు, పాదుకా పట్టాభిషేకం జరు గుతుందన్నారు. 13వ తారీకు సాయంత్రం 6 గంటలకు నుండి కోలాటం రాత్రి 8 గంటల నుండి శ్రీ రామ రాజ్య దర్బార్ సేవా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవలసిందిగా ఆయన కోరారు.

# వాహనాల ఫిట్నెస్ చేయాలంటూ నిరసన



కొవ్వూరు,మేజర్న్యూస్ : కొవ్వూరు రవాణా శాఖ కార్యాలయం నందు నిర్వహించవలసిన వాహనాల ఫిట్నెస్ చెకింగ్ ను జిల్లా కేంద్రంలో నిర్వహించడం సరైనది కాదని కొవ్వూరు ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఇటీవల కొవ్వూరు పట్టణంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం లో నిర్వహించే వాహనాల ఫిట్నెస్ చెకింగ్ రాజానగరం కు తరలించడం పట్ల కొవ్వూరులో ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్ నుండి కొవ్వూరు పట్టణ పుర వీధుల గుండా ఆర్డీవో కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ తన ఆటో ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి రోజులు తరబడి ఎదురు చూడవలసిన పరిస్థితులు నేడు కొవ్వూరు పట్టణంలో నెలకొన్నాయని వాపోయారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో వేలాదిమంది వాహనదారులు పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో వాహనాలు ఫిట్నెస్ చేయించుకునే వారని, మార్చి 14 నుండి వాహనాల ఫిట్నెస్ చెకింగ్ రాజానగరం తరలించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన చెందారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల నుండి రాజానగరం 30 నుండి 50 కిలోమీటర్లు దూరం ఉంటుందని అంత దూరం వ్యయ ప్రయాసలు పడి వెళ్లినా, అక్కడ ఫిట్నెస్ చెకింగ్ జరగకపోతే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని దయచేసి అధికారులు కొవ్వూరు రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్నెస్ చెకింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం. సుందర బాబు, కొవ్వూరు ఆటో యూనియన్ నాయకులు ఏసారపు శ్రీను, పాలంగి రాజు, రాజేంద్ర, పాతాళ శ్రీనివాస్, బోసి బాబు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు







**చింతూరు,మేజర్న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మొదటి వార్షికోత్సవం మరియు తృతీయ సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చింతూరు గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మరియు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, గౌరవ అతిథిగా చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగుల్ మీరా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైనది. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్.కె రత్న మాణిక్యం మాట్లాడుతూ కళాశాల ప్రారం భమైనప్పటి నుండి కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, కళా శాల అభివృద్ధిని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన అదనపు స్థలం కొరకు కృషి చేస్తున్న చింతూరు ఐ.టి.డి.ఏ పి.ఓ, డీ.ఎఫ్.ఓ, ఎఫ్.ఆర్.ఓ, చింతూరు తహసిల్దార్ తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవల ప్రధానమంత్రి ఉచ్చితార్ శిక్ష అభియాన్ నుండి మంజూరైన రూ.5 కోట్లు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను సమర్పించి, పరిపాలన అనుమతుల కొరకు వేచి చూస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు కళాశాల అభివృద్ధికి కృషి చేయుటకు హామీ ఇచ్చారు 2021- 2024 బ్యాచ్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్.నాగుల్ మీరా మాట్లా డుతూ విద్యార్థినీ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని కోరారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడ లు, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమ తులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకు న్నాయి. కళాశాల సాంస్కృతిక విభాగ కార్యకర్త జి.హారతి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటరావు, ఎం.శేఖర్, ఎన్.రమేష్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవి దృష్ట్యా ఈ ఏడాది వడగాలులు వీచే అవకాశం ఎక్కువగా ఉంటుంది

- అనుకోని సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అటువంటి ఘటనలు నేపధ్యంలో త్రీ మ్యాన్ కమిటి ద్వారా 24 గంటల్లో నివేదిక అందచెయ్యాలి - కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** వాతావరణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే నేపధ్యంలో వడగాలులు వీచే అవకాశం ఉందని, క్షేత్ర స్థాయిలో మునిసిపల్ , పంచాయితీ అధికారులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అందులో భాగంగానే ప్రజల్లో అవగాహన కలుగచెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు.గురువారం ఉదయం వడగాలులు నేపధ్యంగా స్థానిక కలక్టరేట్ సమావేశ మందిరం నుంచి క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో వడగాలులు తీవ్రత దృష్ట్యా సమన్వయ శాఖల శుక్రవారం ఉదయం రెవిన్యూ డివిజనల్ అధికారులు, సాయంత్రం మండల, మునిసిపల్ అధికారులు సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చెయ్యాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎస్ వో పి పై మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందన్నారు. చలివేంద్రాలలో కుండల ద్వారా చల్లని శుద్ధమైన త్రాగునీరు సరఫరా చెయ్యాలని, ఇందుకు స్వచ్ఛంధ సంస్థలు,పరిశ్రమల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల , అంగన్వాడీ కేంద్రాలకు ఒంటి పూట బదులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తు, తరగతులు నిర్వహించే వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తి లేదని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడగాలులు తీవ్రత దృష్ట్యా చెయ్య తగినవి,చెయ్యకూడని పై గ్రామాల్లో, వార్డుల్లో ప్రచారం చేయడం వైద్య ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందన్నారు. వాటిని గ్రామస్థాయిలో, క్షేత్ర స్థాయిలో ప్రచారం కల్పించడం ముఖ్యం అన్నారు. ప్రామాణిక ఆపరేటింగ్ విధానం పై తగిన మార్గదర్శకాలు క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వడం జరిగింది అని పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలీలు పనిచేసే ప్రదేశాల్లో నీడ ఉండేలా టెంట్స్ ఏర్పాటు,త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచడం వృద్ధులు , గర్భిణీలు, బాలింతలు, పాలిచ్చే తల్లులు విషయంలో వారికి సాధ్యం అయ్యే పనులను ఇవ్వడం, ఎండ తీవ్రత పెరగకుండా సమయ పాలన విషయంలో ముందుగా పనులను ప్రారంభించాలన్నారు




**-ఐస్ ఫ్యాక్టరీలను తనిఖీ చేయండి - కలెక్టర్**

వేసవి దృష్ట్యా ఐస్ సరఫరా చేసే ఫ్యాక్టరీ ల నిర్వహణ వ్యవస్థ దృష్టి పెట్టాలని, శుద్ధమైన నీటితో మాత్రమే ఐస్ తయారు విధానం లో ఉపయోగిస్తున్నారో లేదో తనిఖీ లు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు, అంగన్వాడి కేంద్రాలకు ఒంటి పూట బదులు నిర్వహించాలని కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. పాఠశాలల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జిల్లా పాఠశాల విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ నాగేశ్వర రావు సెల్ నెంబరు o919398680029 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ కార్యాలయం పనిచేసే సమయంలో ఫిర్యాదు చెయ్యవచ్చు అన్నారు. రక్షిత, శుద్ధమైన త్రాగునీరు సరఫరా పై నిఘా వ్యవస్థ పెట్టాలని , వో ఆర్ హెచ్ ట్యాంకులు, నీటి సరఫరా చేసే ట్యాంకర్ల నిర్వహణ వ్యవస్థ పై తనిఖీలు నిర్వహించి, నిర్ణీత కాలవ్యవధితో ప్రోటోకాల్ అనుసరించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వడగాలులు తీవ్రత వల్ల అనారోగ్యం పాలు, మరణాలు సంభవిస్తే వారిపై కమిటీ సభ్యులు అధ్వర్యంలో 24 గంటల్లో నివేదిక అందజేయాలన్నారు. తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్, పోలీస్ అధికారి సంయుక్తంగా కలిసి పని చేసి నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు, ఉపాధిహామీ పథకం కార్మికులకు, విద్య సంస్థలకు, తగిన విధంగా వో ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులు కోరారు. శాఖ పరమైన ఇండెంట్ ఇవ్వాలని కలక్టర్ ఆదేశించారు. ఇప్పటికే పి హెచ్ సి పరిధిలో తగిన స్టాక్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. వేసవిదృష్ట్యా అధిక లోడు తో వెళ్ళే, సరుకులు తీసుకునే వెళ్ళే భారీ వాహనాలు ప్రయాణాలపై, ప్రయాణికులను తీసుకునీ వెళ్ళే వాహనాల ను తనిఖీలు నిర్వహించాలని కలెక్టరు పి ప్రశాంతి పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆయా వాహనాలు నడిపే వాహన చోదకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డ్రైవర్లకు తగిన అవగాహన కల్పించడం ముఖ్యం అన్నారు.

# పిఠాపురం అభివృద్ధిపై పాడా పీడి సమీక్ష



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) పీడీ చైత్ర వర్షిణి గురువారం పిఠాపురం నియోజకవర్గంలో మూడు మండలాల పరిధిలోఉన్న అగ్రికల్చర్, ఇరిగేషన్, హార్టికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, సెరికల్చర్ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల కోసం కావాల్సిన అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు ప్రజలకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని, ఏమన్నా సమస్యలు ఉంటే వెంటనే వాటిని పాడా దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ఆమె గొల్లప్రోలు మండలంలో సుద్దగెడ్డ కాలువ పై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం చేబ్రోలు గ్రామంలో పట్టుగుళ్ళు షెడ్ ని సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అలాగే పట్టు పరిశ్రమ మార్కెట్ కి వెళ్లి అధికారులతో మాట్లాడారు. అక్కడ పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో పీడీ వెంట ఏపీడీ పి.వశంతమాధవి మరియు సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మహిళల కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం మండలంలో అర్హులైన మహిళలు కుట్టు మిషను శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని రంపచోడవరం ఎంపిడివో సుండం శ్రీనివాసు దొర విజ్ఞప్తి చేశారు. మండలంలోని 19గ్రామ పంచాయితీలు పరిధిలోని బిసి/ఈబిసి/కమ్మ/రెడ్డి/ క్షత్రియ/వైశ్య/బ్రాహ్మణ/ కాపు (బలిజ) కులాల మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ద్వారా ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి శిక్షణ పూర్తి అయిన తరువాత కుట్టు మిషను ఇస్తారని తెలిపారు. కుట్టు మిషను శిక్షణ పథకానికి అర్హత ఉన్న మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు.

మండలంలో స్థిర నివాసి అయి ఉండాలని, సరైన ఆధార్ కార్డు కలిగి ఉండాలని, సంబంధిత కులధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని, అభ్యర్థిని వయసు 20 నుండి 40 సంవత్సరాలు మధ్యలో



ఉండాలన్నారు. అభ్యర్థులు సంవత్సర ఆదాయం గ్రామాలలో రూ. 1,50,000లు, పట్టణాలలో రూ. 2,00,000లు మించరాదని సూచించారు. వితంతువులు, దివ్యాంగ మహిళలకు ప్రాధాన్యం ఇస్తారని, ట్రెనింగు తీసుకొనే సమయంలో హాజరు కనీసం 70 శాతం ఉండాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో హౌసింగ్ మాపింగ్ ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. అభ్యర్థులు సమర్పించవలసిన ధృవీకరణ పత్రాలు ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం,కుల ధృవీకరణ పత్రం, రైస్ కార్డు, మొబైల్ నెంబరు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు దరఖాస్తు ఫారంతో జత చేయాలన్నారు. అర్హత గల అభ్యర్థులు 22.03.2025 వరకు ఆయా గ్రామ సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడివో సుండం శ్రీనివాసు దొర విజ్ఞప్తి చేశారు.

## భూముల క్రమబద్దీకరణకు ధరఖాస్తులు స్వీకరణ

- తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల క్రమబద్దీకరణకు పెద్దాపురం మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పట్టాలో మహిళ పేరు మాత్రమే జారీ చేస్తారని, పట్టా, కన్వెయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ళ తరువాత యాజమాన్య హక్కులు కల్పిస్తారని, 2019 అక్టోబర్ 15న ప్రామాణిక తేదిగా పరిగణించి, ఆ తేది కంటే ముందు ఆక్రమణలో ఉన్న స్థలాలను మాత్రమే క్రమబద్దీకరిస్తామని, తెలిపారు. 150 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 150 నుండి 300 గజాల లోపు ఆక్రమణ దారులు, బేసిక్ విలువలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలన్నారు. 300 నుంచి 40 గజాల పరిధిలో వందశాతం బేసిక్ విలువ, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు బేసిక్ ధర 200శాతం, పూర్తి రిజిస్ట్రేషన్ చార్జీలు కట్టాలన్నారు. 450 గజాలకు మించితే బేసిక్ విలువకు 5 రెట్లు, 100శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలని తెలిపారు. అందుకు సిద్దంగా లేకపోతే భూమిని ప్రభుత్వం సాగు చేసుకుంటుందని తెలిపారు. లేఅవుట్లు, కాలువలు, నదీ ప్రవాహపు గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాల, జలవనరులకు సంబంధించిన జలాలలో ఆక్రమణలను క్రమద్దీకరణ చేదం జరుగదని తెలిపారు. మండలంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు పరిశీలించి, జాబితాలు సచివాలయాలలో ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరిస్తారని, తహశీల్దార్ వెంకటలక్ష్మీ పేర్కొన్నారు.

## మున్సిపల్ కబేళా ఆశీల పాట రూ.43 వేలకు ఖరారు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో సంవత్సరం కాలపరిమితికి ది.1-4-2025 నుండి 31-3-2026 వరకు కబేళా వేలం పాట రూ.43,500/-లకు ఖరారైనట్లు మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. గురువారం పురపాలక సంఘంలో బహిరంగ వేలం నిర్వహించడం జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో వేదుల చంద్రశేఖరం, ఆర్ఐ గంగాధరం, మున్సిపల్ సిబ్బంది పాటదారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘ మహిళలు చేస్తున్న ఆర్థిక అభివృద్ధి విజిట్



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ ప్రోగ్రాం డైరెక్టర్ ఇం డియన్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు నాన్ రెసిడెన్షియల్ ఫీల్డ్ ఇమర్షన్ ట్రెనింగ్ కొరకు ఆత్రేయపురం గ్రామంలో చేస్తున్న ఫీల్డ్ విజిట్ లో భాగంగా గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశీలించి ద్వారా మహిళల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల, పోలీస్ స్టేషన్, అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ, శంకర్, వనజ, రవీంద్ర, ఏపిఎం గంగాధర్, సీసీ పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో బోగస్ మస్టర్ బిల్లులపై దృష్టి పెట్టండి

**– ఉపాధి హామీ పనుల్లో అధికార పార్టీ జోక్యం నివారించండి**

**– జిల్లా కలెక్టర్‌కు తాటిపాక మధు వినతి**



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** ఉపాధి హామీల్లో అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలని, గ్రామాల్లో బోగస్ మాస్టర్ బిల్లులపై దృష్టి పెట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం యు.కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వారు బికెఎంయు సభ్యత్వం చేర్పించారు.

ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కొన్ని మెట్ట ప్రాంతాలలో చాలా గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి పట్టణాలకు వలసలు వెళ్లడం జరుగుతోందన్నారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ చట్టంను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. చాలా గ్రామాలలో పనులు దొరకకపోగా బ్రతకడం కోసం అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ అప్పులు తీర్చడానికి ఉన్న గ్రామాలలో పనులు లేవు. దీంతో జీవనం కోసం ఇతర పక్క రాష్ట్రాలకు వలసల బాట పట్టారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ, వ్యవసాయ కూలీల జీవన పరిస్థితులలో మార్పు రావడం లేదన్నారు. రాజకీయ జోక్యంతో నిర్వీర్యం అవుతున్నది. పూర్తి స్థాయిలో పనులను కూలీలందరికి కల్పించకపోవడంతో వందల సంఖ్యలో కూలీలు జీవనం కోసం వలసలు పోతున్నారు. గ్రామాలలో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి. వలసలు నివారించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ. 700 ఇవ్వాలన్నారు.

జాబ్ కార్డులో వున్న అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు 200 రోజులు పని దినాలు ఇప్పించాలన్నారు. ఉపాధి హామీలో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలి. జిల్లాలో ఇప్పటికే చేసిన పనికి 4 నెలల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీలో రాజకీయ జోక్యాన్ని, ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలన్నారు. ఇప్పటికే గ్రామాలు వదిలి వలసలు వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది కి ఉద్యోగ భద్రత కల్పించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తీసివేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిపై కక్ష సాధింపులు, వేధింపులు నివారించాలన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో బోగస్ మస్టర్లు వేసి బిల్లులు చేసుకోవడం జరుగుతోందన్నారు. ఇలాంటి వాటిని అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శాఖ రామకృష్ణ, నక్క శ్రీనివాసరావు, గోవింద్, శ్రీను, సత్యవతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోండి

**– తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి**

**– రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు)**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్యులకు ఉపాధి కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం 2024–2025 సంవత్సరానికి గాను సబ్సిడీతో కూడిన రుణాలను వివిధ వ్యాపారాల ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందేందుకు ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తులను ఆన్ లైన్ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) తన కార్యాలయంలో ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఆ పైన డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉంటున్న 21 సంవత్సరాలు నుండి 60 సంవత్సరాల వయసు లోపు వారికి కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ , రేషన్ కార్డు వంటి పత్రాలతో ద్వారా ఆన్ లైన్ చేసుకోవాలని లక్ష రూపాయల నుండి 5 లక్షల రూపాయల వరకు 40% నుండి 50% వరకు సబ్సిడీ అందజేయడం జరుగుతుందని జనరిక్ మందుల షాప్ కి 8 లక్షల రూపాయల వరకు 50% సబ్సిడీతో కూడిన రుణాలను కూడా కార్పొరేషన్ ద్వారా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కొండబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఈ యొక్క అవకాశాన్ని ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులు సద్విని చేసుకోవాలని ఆయన కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో తెలుగు యూనివర్సిటీ కి పొట్టి శ్రీరాములు గారి పేరు కొనసాగించాలని తెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు కి తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్న గౌరవించాలని ఆయన కోరారు.

# 30న అమలాపురంలో మలబార్ షోరూం ప్రారంభం




కాకినాడ/అమలాపురం, మేజర్ న్యూస్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాలు విక్రయ సంస్థ త్వరలో తమ వ్యాపార విస్తరణలో భాగంగా 12నూతన షోరూములను ప్రారంభించబోతోంది. అందులో భాగంగా డా.బీఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నూతన షోరూమ్ ఈనెల 30న ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే 6వ అతిపెద్ద ఆభరణాల వ్యాపార సంస్థగా స్థానం సంపాదించి, ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ & డైమండ్స్, భారతదేశంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేయడానికి ఈ నెలలో 12 కొత్త షోరూమ్ లను ప్రారంభించబోతుంది. ఈ తాజా విస్తరణతో మొత్తం మలబార్ షోరూమ్ల సంఖ్య 13 దేశాలలో 391 షోరూమ్లకు పెరుగుతుంది మరియు భారతదేశ వ్యాప్తంగా 19 రాష్ట్రాలలో మలబార్ తమ ఉనికిని చాటుకుంటుంది.ముంబైలోని పన్వెల్, పూణేలోని సింహగడ్ రోడ్, ఒడిశాలోని బ్రహ్మపూర్ మరియు సౌభాగ్య నగర్, జార్ఖండ్‌లోని ధన్బాద్, కర్ణాటకలోని హాస్పెట్, నాగర్భవి మరియు చిత్రదుర్గ, ఆంధ్రప్రదేశ్లోని నంద్యాల, అమలాపురం, మచిలీపట్నం, ఉత్తర్ ప్రదేశ్ లోని వారణాసి ప్రాంతాల్లో ఈ కొత్త షోరూములు ప్రారంభించ`బడుతున్నాయి. మలబార్ గ్రూప్ కొత్త విస్తరణలో భాగంగా రూ.600 కోట్లు పెట్టుబడిపెట్టగా, ఈఆర్థిక సంవత్సరంలో వివిధ హోదాల్లో 406 మంది ఉద్యోగులను నియమించుకుంది. 2025 సంవత్సరంలో కొత్తగా 60 మలబార్ గోల్డ్ & డైమండ్స్ షోరూమ్లలను ప్రారంభించాలని యోచిస్తోంది. 2025 ఏప్రిల్ నెలలో, మిడిల్ ఈస్ట్, యూకే మరియు కెనడా దేశాలలో మలబార్ గ్రూప్ 5 కొత్త షోరూమ్‌లను ప్రారంభించబోతుంది.ప్రముఖ నటుడు మరియు మలబార్ బ్రాండ్ అంబాసిడర్ జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి వినియోగదారుల అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది.మలబార్ గోల్డ్ & డైమండ్స్ విస్తరణ గురించి మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మలబార్ బ్రాండ్ ఉనికిని విస్తరించడం ద్వారా ఎక్కువ మంది వినియోగదారులకు నాణ్యతతో కూడిన మరియు పారదర్శక వ్యాపార పద్ధతులను అందించడం వంటి విస్తృత దృక్పథంతో విస్తరణ ప్రణాళిక ఉంటుందన్నారు.

## పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో - ఎం.ఈ.ఓ



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండేలా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పేరెంట్స్‌ను చైతన్య పరచాలని సామర్లకోట మండల విద్యా శాఖాధికారి 2 పి.పుల్లయ్య పేర్కొన్నారు.గురువారం ఉదయం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రాపౌట్స్ ను కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి స్కూల్ లో చేర్చే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడి మాని వేసిన ఇద్దరు అబ్బాయిలు ను తిరిగి బడిలో చేర్పించారు హెచ్ ఎం సాయి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని ,నూతన మెనూతో డొక్కా సీతమ్మ మధ్యాహ్నా పథకం అమలు చేస్తుందని ,ప్రతి రోజూ స్కూల్‌కు హాజరు కావడం ద్వారా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా పని చేయడం నేరమని ,ప్రభుత్వ బడుల్లో ఉన్న నాణ్యమైన ఉచిత విద్య ను పిల్లలకు అంద చేయాల్సిన బాధ్యతను పేరెంట్స్ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే శ్రీనివాస్,జి బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## జిజిహెచ్‌లో నోటి ఆరోగ్య దినోత్సవం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గురువారం స్థానిక ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో చిన్నపిల్లల విభాగం ,డైస్ సెంటర్లో "నోటి ఆరోగ్య దినం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెంటల్ సర్జన్ డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ, దంత సంరక్షణ, ఆరోగ్య సమస్యలు గురించి అవగాహన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. తప్పనిసరిగా దంతాల సంరక్షణ విషయంలో అజాగ్రత్త తగదన్నారు. ప్రతి రోజూ తప్పనిసరిగా రెండుసార్లు దంతాలను తోముకోవాలనీ కోరారు. డెంటల్ హైజనిస్ట్ డా.సూర్య వర్మ నోటి పరిశుభ్రత, వాటిని పాటించాల్సిన నియమాలు, టెక్నిక్స్ గురించి తెలియ చేశారు. దంతాలు ఆరోగ్యంగా ఉన్నా కూడా ఏదైనా సందేహాలు ఉంటే డాక్టరును సంప్రదించి తగిన చికిత్స పొందాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులకు నోటి శుభ్రత గురించి పూర్తిగా వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ డాక్టర్ మోహన్ చంద్ర, చిన్నపిల్లల హెచ్వోడి డాక్టర్ ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి సౌజన్య,డైస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అనాధికార చేపల వేటపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు



**సామర్లకోటి,మేజర్‌న్యూస్ :** సామర్లకోట పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించే ఎన్ఎఫ్సిఎల్ చెరువులో అనాదికార చెప్పాలవేట కొనసాగుతుందని, దానిపై చర్యలు చేపట్టి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి ఫిల్టర్ బెడ్ చెరువు పరిస్థితి పై వివరించారు. ఫిషర్ మెన్ సొసైటీ కి చేపలవేటకు ఇచ్చిన గడువు ఈనెల 16వ తేదీతో ముగిసిందని, తదుపరి 10 రోజుల్లో చెరువును మొత్తం ఎండగట్టి తదుపరి కొత్తగా నీరు పెట్టాలని చెప్పగా చేపల వేటకోసం రాత్రి సమయాల్లో ఔట్లెట్స్ వాల్వ్ ఆపి అన్నదికారికంగా చేపలవేట కొనసాగిస్తున్నారని వివరించారు. అలా చెరువు జలాలు బయటకు వెళ్లకుండా అనాదికారికంగా చేపల వేట నిర్వహించే వారిపై చర్యలు తీసుకుని చెరువు ద్వారా పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కౌన్సిలర్ హరిబాబు కమిషనర్ ను కోరారు.

# పంచాయితీ ఆదాయానికి ప్రభుత్వ కార్యాలయాలు గండి





**- లక్షల్లో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు**
**- కార్యదర్శి నోటీసులు ఇచ్చిన స్పందించని అధికారులు..**
**- ప్రభుత్వ కార్యాలయాల పన్నుల వసూళ్లపై పదనిసలు..**

**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** సామాన్య ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించడంలో జాప్యం చేస్తే అధికారులు హడావిడి చేస్తారు.అయితే ఇక్కడ మాత్రం అధికారులు..ప్రభుత్వ కార్యాలయాలకు ఆ నిబంధనలు వర్తించవనుకున్నారేమో..లేదా..పన్నులు చెల్లించకపోతే తమను ఎవరు ప్రశ్నిస్తారులేఅనుకున్నారో ఏమో కానీ..పన్నులు చెల్లించడం మానేశారు. తీరాఆబకాయిలు ఇంతింతై వటుడింతై అన్నచందంగా వేలల్లో రూపాయలు పేరుకుపోయిన ఆయా ప్రభుత్వ కార్యాలయాల పన్ను బాకీలు.దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలు దేశ అభివృద్ధి గ్రామ అభివృద్ధి తోనే సాధ్యం అంటూ ప్రగల్భాలు ప్రసంగాలు ఇచ్చే ప్రభుత్వ అధికారులు ఆ గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తుండటంపై గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.గ్రామ పంచాయితీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే ఆదాయంపైనే పంచాయితీ వ్యవస్థ ఆధారపడి ఉంది.పన్నులు వసూలు విషయంలో పారదర్శకంగా ఉండాల్సిన అధికారులు వెనకడుకు వేస్తున్నారు.ఇంటి పన్ను ఒక్కరోజు ఆలస్యమైతే ఇంటికి వచ్చి నానా హడావిడి చేసి అధికారులు హెచ్చరించి మరి వెళ్తారు.ఇంటి, వ్యాపార ఇతర పన్నులు వసూలు విషయంలో ముక్కుపిండి వసూలు చేసే పంచాయితీ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల పన్నుల విషయంలో మొహమాటం చూపించడంతో ఒక్కో ప్రభుత్వ కార్యాలయం బాకీలు వేలల్లో బకాయిలు ఉన్నాయి..ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కొత్తపేట పంచాయితీ కార్యదర్శివెంకటేశ్వరరావు ఆయాప్రభుత్వ కార్యాలయాలకు పన్ను బకాయిలపై నోటీసులు ఇవ్వడం జరిగింది. నోటీసులు అందుకున్న కార్యాలయాల అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదంటూ కార్యదర్శి చెప్తున్నారు.సామాన్యులకు నోటీస్ ఇచ్చిన పన్ను చెల్లించకపోతే కోర్టు నోటీసులు అంటూ ప్రశాంతంగా ఉన్న ప్రాణాన్ని హడలెత్తిస్తారు.2016-17 సంవత్సరం నుండి 2024-25 సంవత్సరం వరకు ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.9.94 లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది.

వసూళ్ల విషయంలో పంచాయితీ కార్యదర్శికి అధికారం ఉన్నప్పటికీ ఎందుకు వసూళ్లు చేయడం లేదో అర్థం కావడం లేదు.గృహ పన్నులు,ప్రభుత్వ కార్యాలయాల పన్నులు వసూళ్ల విషయంలో వ్యత్యాసం ఎందుకు చూపిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పూర్వం పంచాయితీ కార్యదర్శిగా పనిచేసిన బి.రత్నం కొన్ని ప్రభుత్వ కార్యాలయాల నుండి పన్నులను వసూళ్లు చేసినట్లు పలువురు చెప్తున్నారు.పాపాలు పెరిగినట్టు వేలల్లో ఉన్న బకాయిలు నేటికి లక్షల్లో చేరాయి.బకాయిలను గాలికి వదిలేసి పంచాయితీ లో నిధులేవు అంటూ కుంటిసాకులతో కాలంనెట్టుకొస్తున్నారు.పైరవీలు పై చూపెడుతున్న శ్రద్ధ ప్రభుత్వ కార్యాలయాల పన్నుల వసూళ్లపై చూపిస్తే గ్రామాభివృద్ధికి కృషిచేసినవారుగానిలుస్తారు.ఎప్పటికైనా ఉన్నతాధి కారులు జోక్యం చేసుకుని లక్షల్లో ఉన్న పన్ను బకాయిలను వసూలు చేయాలని తద్వారా గ్రామాభివృద్ధి సహకరించాలి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# స్మార్ట్ మీటర్లతో మా పొట్ట కొట్టొద్దు

**- విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకుల ఆవేదన**




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** విద్యుత్ సంస్థను నమ్ముకుని 22 సంవత్సరాల నుండి విద్యుత్ మీటర్ రీడింగ్లు తీస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న వేలాది మందిని పొట్ట కొడుతున్నారని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం అమలాపురం సూపరింటెంట్ ఆఫ్ ఇంజినీరర్, డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు మీటర్ రీడర్స్ తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సందర్భంలో మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోయే ప్రమాదం వుంది అన్నారు. విద్యుత్ సంస్థను నమ్ముకొని గత 23 సంవత్సరాల నుండి స్పాట్ బిల్లింగ్ చేసుకొని చాలీచాలని జీతాలతో సంస్థను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నాము అని, ఇప్పుడు తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తమ కుటుంబాలకు న్యాయం చేయమని వినతిపత్రం ఇచ్చామని నాయకులు తెలిపారు.

# నాటు సారా బట్టీలపై పోలీసులు దాడి

**- 70 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని నాటు సారా బట్టీలపై దేవీపట్నం పోలీసులు మెరుపు దాడి చేశారు. దేవీపట్నం ఎస్ఐ కె.షరీఫ్ అందించిన సమాచారం ప్రకారం గురువారం నాడు దేవీపట్నం మండలం ఎస్.రామన్నపాలెం శివార్లలో పోలీసులు దాడి చేసి నాటుసారా కాస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఆ వ్యక్తి వద్ద నుండి 70 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 100 లీటర్ల సారా తయారీ కేంద్రానికి ఉపయోగించే పెద్ద గిన్నె ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చడం జరిగిందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో నాటు సారా బట్టీలు ఉంటే ఆ సమాచారం పోలీసులకు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

# ప్రకృతి పర్వ పర్యావరణ పరిరక్షణ సమితి మజ్జిగ పంపిణీ..




**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** వేసవి దాహార్తిని తీర్చేందుకు ప్రతి గురువారం మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ప్రముఖ వైద్యులు సకిరెడ్డి విజయబాబు అన్నారు. గురువారం ఏలేశ్వరం ప్రధాని రహదారిలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సామాజిక సేవలో భాగంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు బాలాజీ రావు, గోళ్ళ నాగేశ్వరరావు, రైతు సహ దేవుడు, కోరాడ నారాయణరావు సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరుని ఆదాయం రూ. 29.66 లక్షలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో హుండీల ఆదాయం రూ. 29,66,406లు వచ్చింది. ఆలయంలో 2024 డిసెంబర్ 6వ తేదీనుంచి నుండి 2025 మార్చి 20వ తేదీ వరకు ఆలయానికి వచ్చిన హుండీల ఆధాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ ఆధ్వర్యంలో 105 రోజులకు సంభందించి ఆధాయ లెక్కింపు కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. దేవస్థాన అర్చకులు, భక్తులు, పురప్రజలు, భక్త మండలీల మహిళల సహకారంతో హుండీలను తెరిచి లెక్కించగా నగదు రూపేణా రూ. 16,15,788 లు, 67 గ్రాముల బంగారం వస్తువులు, 600 గ్రాముల వెండి వస్తువులు హుండీల్లో పడినట్టు ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. అలాగే దర్శన టికెట్ల ద్వారా రూ. 7,05,960, సేవా టికెట్ల ద్వారా రూ. 65,747, ప్రసాద అమ్మకాల ద్వారా రూ. 2,66,215, అన్నదానం ద్వారా రూ. 3,12,696 వెరసి రూ. 29,66,406 ఆధాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమములో దేవస్థానము మాజీ చైర్మెన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, దేవస్థానము అర్చకులు, ఆలయ సిబ్బంది, ఆర్య వైశ్య సంఘం సభ్యులు, శ్రీలక్ష్మి నారాయణ సేవా సంఘం సభ్యులు, భక్తులు, పురప్రజలు, నాయకులు పాల్గొని సేవల నందించారు.

# మార్చి 22న గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో సంకల్ప మెగా జాబ్‌మేళా

**-ఆన్లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి**
**-ఆర్ట్ కళాశాలలో శనివారం ఉదయం 9.30 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ**
**-గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సంకల్ప మెగా జాబ్ మేళా కు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో "సంకల్ప - జాబ్ మేళా" పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి " సంకల్ప - మెగా జాబ్ మేళా" నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తూర్పు గోదావరి జిల్లా కు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంకల్ప మెగా జాబ్ మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, వివిధ ఉద్యోగాల్లో చేరేందుకు ఎస్.ఎస్.సి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, ఎం.టెక్, ఫార్మసీ, ఎం.బి.ఎ, ఎం.కాం తదితర కోర్సులు పూర్తిచేసిన 19 నుండి 50 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియ చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళీ వివరాలు తెలియ చేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రి నియోజకవర్గంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కళాశాల), వై-జంక్షన్ ప్రాంగణంలో మార్చి 22 శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, తగిన ప్రమాణాలతో ఎంపిక ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత వెబ్సైట్ ద్వారావారి పేర్లు నమోదు చేసుకోవాలి.

ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ రెజ్యూమే, ఆధార్ కార్డు, విద్యా సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తదితర అవసరమైన పత్రాలతో ఈ నెల 22వ తేదీ, శనివారం ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం, మరింత సమాచారం కొరకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 ఫోన్ నెంబర్ లని ఉదయం 9:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎ. అప్పలకొండ, డి ఎస్ డి వో విడిజి మురళీ, జిల్లా పర్యటక అధికారి పి. వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.